నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 01 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

# కోవూరులో వైసీపీకి భారీ షాక్

## ఇది వీపీఆర్ మార్క్



- తుస్సుమన్న 'ప్రసన్న' విప్ అస్త్రం
- వైసీపీ వీడి టీడీపీ బాటపట్టిన బుచ్చి పట్టణ కన్వీనర్ టంగుటూరు మల్లారెడ్డి
- కండువా మార్చేసిన 10వ వార్డు కౌన్సిలర్ టీవీ మల్లారెడ్డి
- టీడీపీ నేతల టచ్‌లో.. మరో ముగ్గురు కౌన్సిలర్లు
- నిరాశ, నిస్పృహలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్న శిబిరం

**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :**

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎన్నిక.. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డికి పరాభవాన్ని మిగల్చనుంది. విప్ జారీ చేసి వైస్ చైర్మన్ పదవి కైవసం చేసుకోవాలని ప్రసన్న కన్న కలలు భగ్నమయ్యాయి. బుచ్చి పట్టణ వైసీపీ కౌన్సిలర్లు.. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి జై కొడుతూ సైకిల్ ఎక్కేస్తున్నారు. బుచ్చి నగర పంచాయతీలో జరగనున్న వైస్ చైర్మన్ ఉప ఎన్నికలో నిన్నటిదాకా అభ్యర్థిని బరిలో దింపుతానని ప్రగాల్భాలు పలికిన ప్రసన్న, ఇప్పుడు అంతర్మథనంలో పడ్డారు. వైసీపీ కౌన్సిలర్ల వలసలు చూశాక.. నిన్నటిదాకా విప్ జారీపై హడావుడి చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న శిబిరం డీలా పడిపోయింది. వైసీపీ సీనియర్ నాయకులు ఇప్పగుంట మల్లారెడ్డి నేతృత్వంలో 10 వార్డు కౌన్సిలర్ బెళుం మల్లారెడ్డితో పాటు బుచ్చి మండల వైసీపీ కన్వీనర్ టంగుటూరు మల్లికార్జున్ రెడ్డి, సీనియర్ నాయకులు చెన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కంఠం నరసింహులు, ఆర్కే రవి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ.. తాము టీడీపీ బాట పట్టామన్నారు.

వేమిరెడ్డి దంపతుల నాయకత్వంలో బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వీధి బాలల రక్షణ కోసం.. | లోక్‌అదాలత్ జడ్జి వాణి వెల్లడి

# టోల్ ఫ్రీ నెంబర్ 105

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :**

అనాథలు వీధి బాలలు ఎక్కడయినా రోడ్డు మీద కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 105 కు ఫోన్ చేస్తే వారికి చట్ట పరమైన రక్షణ కల్పిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి కే.వాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కే.వాణి ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు డీకేడబ్ల్యూ కాలేజీలో వీధి బాలల దినోత్సవం సంద



ర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ.. వీధి బాలలు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం -మిగతా 2లో

అబద్ధాలు చెప్పడంలో..

# చంద్రబాబు మాస్టర్ డిగ్రీ

## వైసీపీ నెల్లూరు రూరల్ ఇంచార్జ్ 'ఆనం' స్పష్టం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** చంద్రబాబు అబద్దాలు చెప్పడంలో మాస్టార్ డిగ్రీ చేశారని అయన చెప్పే అబద్దాలు ప్రపంచంలో ఎవ్వరూ చెప్పలేరని రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేనని చంద్రబాబు చెప్పడం అయన అసమర్థతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఉండే అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. తల్లులకి, రైతులకు, ఆడపడుచులకు చంద్రబాబు బాకీ ఉన్నారని చెప్పారు. చంద్రబాబుని నమ్మి మరోసారి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ప్రజల్లో చర్చ మొదలైందని చంద్రబాబు ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. టీడీపీ ఎమ్మెల్యేలు అరాచకాలు చేస్తున్నారని, ప్రకృతిని దోచుకుంటున్నా.. చంద్రబాబు మౌనంగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సత్తార్, బొబ్బలి శ్రీనివాస్ యాదవ్, వైసీపీ నాయకులు నెల్లూరు మదనమోహన్ రెడ్డి, లక్ష్మీ సునంద, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోడవరం అటవీ ప్రాంతంలో..

# అక్రమంగా జామాయిల్ నరికివేత



## నలుగురిపై కేసు నమోదు, జరిమానా విధింపు

**జలదంకి, మేజర్‌న్యూస్ :**

జలదంకి మండలంలోని చోడవరం అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి అక్రమంగా జామాయిల్‌ను కొట్టి ట్రాక్టర్‌కు ఎక్కించి తరలిస్తుండగా కావలి అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా జామాయిల్‌ను నరికి వేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేస్తున్నట్లు కావలి ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చోడవరం అటవీ ప్రాంతంలో జామాయిల్‌ను అక్రమంగా నరికి వేస్తున్నట్లు పైఅధికారుల సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో జామాయిల్ -మిగతా 2లో

9న ఆత్మకూరులో

# అభివృద్ధి పనులకు శ్రీకారం


3లో

- హాజరుకానున్న మంత్రులు నారాయణ, బీసీ జనార్ధన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, సవిత
- అమృతధార-2 పేరుతో తాగునీటి సమస్యల పరిష్కారానికి భగీరథ యత్నం
- గ్రామీణ వ్యవస్థ మెరుగుదలకు సీఎం, డిప్యూటీ సీఎం కృషి
- మంత్రి ఆనం వెల్లడి

ఉత్తమ పంచాయతీగా

# మిక్కిలింపేట

## ఉత్తమ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించిన వేమిరెడ్డి దంపతులు


8లో

# విద్యార్థుల భవిష్యత్తు కోసమే 'ఫీజు పోరు'

### మాజీ మంత్రి కాకాణి వెల్లడి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఫీజు పోరు కార్యక్రమాన్ని ఈనెల 5న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా వైఎస్ఆర్‌సీపీ ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైఎస్ఆర్‌సీపీ ఫీజు పోరు కార్యక్రమం తలపెట్టామని, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి 2900 కోట్ల రూపాయల బకాయిలు తక్షణమే విడుదల చేసి, విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఫీజులు బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఫీజులు కట్టే స్థోమత లేక విద్యార్థులు చదువుకు దూరమై మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఫీజు బకాయిలు చెల్లించే దాకా సర్టిఫికెట్స్ ఇవ్వమని కాలేజీ యాజమాన్యం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో హాల్ టికెట్లు నిరాకరిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలు.. ఫీజు బకాయిలు చెల్లించలేక చదువుకు దూరమవుతున్నామన్న ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేందుకే ఫిబ్రవరి 5న కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు శ్రీకారం చుట్టామన్నారు.

బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఉదయం 10 గంటలకు నివాళులర్పించి, అక్కడ నుండి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి.. వినతి పత్రం సమర్పిస్తామన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు 'ఫీజు పోరు'లో స్వచ్ఛందంగా పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పలువురు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాపారుస్తులందరూ తమ దుకాణాలకు సీసీ కెమెరాలు తప్పనిసరి




### నగర డీఎస్పీ సింధుప్రియ సూచన

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** వ్యాపారస్తులందరూ తమ దుకాణాలకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నగర డీఎస్పీ సింధుప్రియ సూచించారు. బంగారు, వస్త్ర దుకాణాల యజమానులతో నగర డీఎస్పీ సింధుప్రియ నేతృత్వంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారులందరూ తమ తమ దుకాణాల పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, తమ దుకాణాలు ఉన్న వీధుల్లోని ప్రధాన కూడళ్లలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీసు వారికి సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతో నగరంలో నేరాలను నియంత్రించ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో చిన్న బజార్, సంతపేట ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, దశరథ రామారావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు సింగ్, శోభన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### చోడవరం అటవీ ప్రాంతంలో

## అక్రమంగా జామాయిల్ నరికివేత

*(మొదటి పేజీ తరువాయి)*



అక్రమంగా తరలిస్తున్న చోడవరం గ్రామానికి చెందిన నన్నూ రి వీరయ్య, చెరుకూరి కొండయ్య, నన్నూరి మహేంద్ర, మనోహర్ అనే నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి జరిమానాలు విధించి నట్లు పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఎవరైనా అక్రమంగా జామాయిల్ నరికి వేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

### వీధి బాలల రక్షణ కోసం..

## టోల్ ఫ్రీ నెంబర్ 105

*(మొదటి పేజీ తరువాయి)*


జనవరి 31న వీధి బాలల దినోత్సవం జరుపుకుంటున్నామని, వీధి బాలలను గుర్తించి ఆచూకీ తెలిపితే వారిని రక్షించి విద్యాబుద్ధులు నేర్పించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దేందుకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా తగు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. చట్ట పరమైన ప్రతి సమస్యకు లోక్‌అదాలత్‌ను ఆశ్రయించి రక్షణ పొందవచ్చని న్యాయమూర్తి సూచించారు. అదే ఎక్కువగా పల్లెల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు అందరూ ముందుండాలని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. న్యాయ సేవాధి కార సంస్థ ద్వారా ప్రతి పౌరుడు ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. భారతదేశంలో వ్యక్తులు మధ్య వచ్చే తగాదాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవడానికి అధిక కాలం పట్టడమే గాక అధిక శ్రమ ఖర్చులతో కూడిన పని అని పేర్కొన్నారు పేద మధ్య తరగతి ప్రజలు ఈ ఖర్చును భరించలేకున్నారని ప్రభుత్వం ఒక చట్టం ద్వారా నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రజలకు ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగానూ, వెనుకబడిన వర్గాలకు, నిరక్షరాస్యులకు, మహిళలకు, అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశలో ప్రభుత్వం 1987 సంవత్సరంలో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించి దేశవ్యాప్తంగా అధికార సంస్థల ద్వారా ఉచిత సేవలు అందజేయాలని సంకల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో డీకేడబ్ల్యూ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ నారాయణరెడ్డి, డీఎల్ఎస్ఏ మెంబర్ శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం మరిచిన అధికారులు.. ఎండిన నిమ్మ చెట్లు

**అధికారుల తీరుతో.. బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న గిరిజనులు**

**సైదాపురం తహసిల్దార్, వీఆర్వోలను సస్పెండ్ చేయాలి**

**యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య**



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన యాటగిరి శివయ్య సైదాపురం గద్దలతిప్ప వద్ద గత 16 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూమిని సాగు చేయడానికి తన ఇల్లు రూ.5 లక్షలకు తాకట్టు పెట్టి నిమ్మ చెట్లును వేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే 16 సంవత్సరాల నుండి సాగు చేస్తున్న యాటగిరి శివయ్యకు ఏనాడు ప్రభుత్వ అధికారులు ఒకమాట కూడా అనలేదని, ఇప్పుడు ఉన్న కూటమి నాయకులు యానాది కులం అనే చిన్నచూపు చూస్తున్నారని యాటగిరి శివయ్య పేర్కొన్నారు. సైదాపురం మండలంలో తెల్లరాయి గిరాకీ ఉండడంతో అధికారుల సైతం నాయకుల మాటలు విని, వారితో కుమ్మక్కై.. యానాది కులస్తులైన తమపై తహసిల్దార్ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, వీఆర్ఏలను పొలం దగ్గర కాపలా పెట్టారన్నారు. తదుపరి ప్రభుత్వ భూములని బోర్డులు పెట్టించి పొలంలోనికి పోనివ్వకుండా చేశారని, అందుకే ఏం చేయాలో దిక్కుతోచక బాధిత రైతు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం జరిగిందన్నారు. అటు ఇల్లు లేక.. ఇటు పొలం పోయింది.. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక న్యాయం చేయాల్సిన అధికారులే బెదిరిస్తుంటే, ఏం చేయాలో దిక్కుతోచక చచ్చిపోవాలని నిర్ణయించుకుని ముందు తాగాల్సి వచ్చిందని, ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ రమాదేవికి విషయం తెలిసినప్పటికీ తెల్లరాయి మాఫియాతో చేతులు కలిపి తాను సాగు చేస్తున్న పొలం తెల్ల రాయి మైనింగ్‌కి అణువుగా ఉందని గుర్తించిన అధికారులు, గిరిజన కులానికి చెందిన యానాదుల పొలాలపై యానాదులను తప్పించి మైనింగ్ లీజులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే ఓ నెల కిందట కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన పొలాల విషయంలో సర్వే నంబర్లను అనుసరించి దారి డొంకను గిరిజన కులస్తులైన యానాది వారి పొలాలు వైపే ఎక్కువ దారి తీయడం పట్ల గిరిజనులు తహసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించకుండా ఐదుగురు గిరిజన యానాది కులస్తులపై కేసులు పెట్టి వేధిస్తున్నప్పటికీ, ఎవ్వరు కూడా పట్టించుకోక మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పుకొని, ఓ రోజు రాపూరు సీఐ ఆఫీస్‌కి పిలిపించారని, సీఐ కూడా తమపైనే అన్యాయంగా మాట్లాడారని, వారి మాటలు వినకపోవడంతో మాపై నిర్దాక్షిణ్యంగా కేసులు పెట్టి గందరగోళం సృష్టించారన్నారు. ఈ విధంగా మండలంలోని కమ్మవారిపల్లి యానాది కులస్తులకు జరుగుతున్న అన్యాయంపై యానాదల సంక్షేమ సంఘం కల్లూరు పెంచలయ్య తెలుసుకుని.. ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించి నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న యాటగిరి శివయ్యను పరామర్శించారు. అనంతరం శివయ్య సాగు చేస్తున్న భూమిలో ఉన్న నిమ్మ చెట్లను పరిశీలించారు. అలాగే భూకబ్జాదారులు దారి డొంకలను సైతం ఆక్రమించిన విధానాన్ని కల్లూరు పెంచలయ్య పరిశీలించి గిరిజనులను ఇబ్బందులకు గురి చేస్తున్న తహ సిల్దార్, వీఆర్ఓను సస్పెండ్ చేయాలని సైదాపురం రెవెన్యూ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి ఆందోళన చేశారు. కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, స్థానిక గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# 9న ఆత్మకూరుకు నలుగురు మంత్రుల రాక

**పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం**

**ఆత్మకూరు సమగ్ర అభివృద్ధే లక్ష్యం : మంత్రి 'ఆనం'**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని, ప్రజల ఆకాంక్షలకనుగుణంగా అభివృద్ధి సాధించనున్నామని, అందులోభాగంగా ప్రాధమికంగా ఈనెల 9వతేదీన నలుగురు మంత్రులు ఆత్మకూరులో పర్యటించి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆయన ఈ కార్యక్రమాల ఏర్పాట్లు, వివిద పథకాల అమలు గురించి శుక్రవారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్, వివిద శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 9వ తేదీన తనతోపాటు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, బీసీ జనార్ధన్‌రెడ్డి, సత్యకుమార్‌యాదవ్, సవితలు పర్యటించనున్నారని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్ళుగా అభివృద్ధి నిలిచిపోయిన ఆత్మకూరులో సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. అమృతధార-2పేరుతో త్రాగునీటి సమస్యల పరిష్కారానికి భగీరథ యత్నం జరుగుతుందన్నారు. టిడ్కో గృహసముదాయాల్లో రామాలయాల నిర్మాణాలు జరుగనున్నాయన్నారు. గ్రామీణ వ్యవస్థల మెరుగుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఆత్మకూరులో ఆగిన పనులన్నింటిని పూర్తిచేస్తామని, ఇది ఆరంభమేనని, మరింతగా అభివృద్ధి సాధస్తామని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. 9వతేదీ మంత్రుల చేతుల మీదుగా టిడ్కో గృహాలవద్ద రామాలయ నిర్మాణానికి శంఖుస్థాపన జరుగుతుందని, ఆత్మకూరుకు మంజూరైన బిసిబాలికల గురుకుల పాఠశాలను స్తానిక పాలిటెక్నిక్ కాలేజిలో ప్రారంభిస్తామని, 9.6కోట్ల రూపాయలతో ఆత్మకూరు పట్టణానికి తాగునీటి సరఫరాకోసం అమృత్-2 పథకం పనులను ప్రారంభిస్తామని, ఆధునీకరిం చబడిన ఆర్‌అండ్‌బి అతిధిగృహాన్ని ప్రారంభిస్తామని, ఆత్మకూరు అభ యాంజనేయస్వామి విగ్రహంవద్ద నుండి బైపాస్‌రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులకు శంఖుస్థాపన చేస్తామని, ఆత్మకూరు మండల పరిషత్ ఆవరణలో జెడ్పి నిధులు 1.7కోట్ల రూపాయలతో అతిధిగృహ నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తామని రామనారాయణరెడ్డి వెల్లడించారు. స్తానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ విపిఆర్‌ఫౌండేషన్ ద్వారా సమకూర్చిన 107మందిక మోటరైజ్డ్‌ట్రైసైక్ళ్ళను పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో లిఫ్ట్ ఏర్పాటుకు 30లక్షల రూపాయలు కేటాయించామని ఆయన పేర్కొన్నారు. 2కోట్ల రూపాయలతో ఆత్మకూరు రిజర్వాయర్ సుందరీకరణపనులు, నుడా నిధులు ఒకకోటి రూపాయలతో రోడ్డుపనులకు శంఖుస్థాపన చేస్తామని ఆనం వెల్లడించారు. స్తానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభిస్తామని, హాస్పిటల్ స్తాయిని పెంచేందుకు మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఉమ్మడి జిల్లాలో 8400కోట్ల రూపాయల అంచనాలతో జలజీవన్‌మిషన్ పనులు చేపడతామన్నారు. అందరికీ తాగునీరందించాలని, ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామీణ వ్యవస్థకు మెరుగులు దిద్దాలని, త్రాగునీటి సౌకర్యాన్ని విస్తృతపరచాలన్న పట్టుదలతో కృషిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 15శాతం ఇళ్ళకు కూడా కొళాయి కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈలు, డిఇలు సంబందిత ఎమ్మెల్యేలతో చర్చించి పనులను ప్రతిపాదించాలని ఆయన సూచించారు. థర్డ్‌పార్టీ కన్సల్టెన్సీలను కూడా ఏర్పాటు చేశామని, అధికారల సమన్వయంతో నివేదిక తయారు చేస్తారని మంత్రి వివరించారు. 2058వ సంవత్సరం నాటికి పెరగనున్న జనాభాను పరిగణనలోకి తీసుకొని అంచనాలు వేశామన్నారు. సోమశిల, కండలేరు జలాశయాల నుండి కొంతనీటిని త్రాగునీటికి వినియోగించేలా బృహత్తర ప్రణాళిక రూపొందించామని రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో సోమశిల ప్రాజెక్టు ఛైర్మెన్ వేలూరు కేశవచౌదరి, ఆర్‌డబ్ల్యుఎస్, సోమశిల ప్రాజెక్టు, తెలుగుగంగ, ఇరిగేషన్, పబ్లిక్‌హెల్త్, పంచాయతీరాజ్ ఎస్‌ఇలు వెంకటరమణ, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, దేశ్‌నాయక్, గంగాధర్, మోహన్, అశోక్‌కుమార్, జెడ్పి సియివో విద్యారమ, డిసిహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఆత్మకూరు హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ శేషారత్నం, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాసులకు కక్కృతి పడిన పంచాయతీ సెక్రెటరీ



**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కాసులకూకక్కృతి 'పడి'కలిగిరీలో అప్రూలు లేకుండ 'సీసీ'రోడ్లకూ తాను ఇస్తాసరంగా రోడ్డుకలకు అనుమతులు ఇచ్చినట్లు ఇవ్వరు ఏమిచేయలేననే ఉద్దేశంతో, వ్యవహారం నడిపిన వ్యక్తి సెక్రెటరీ, భాధితులు మోర పెట్టుకొన్నప్పటికి ఫోనె చేయవద్దు అని తెలిపారు అతనితోపాటు పంచాయతి అధికారులూ పాత్ర ఉంది కలిగిరిలో పంచాయతీ అప్రూవ్వవాల్ లేదు కానీ ఇస్తారాజాయంగా, రోడ్డు వేసారు పంచాయతీ రోడ్డు నా"పరిధిలోకి రాదు, అన్నదంటే ఇతను పని తెరుఎలావుందో స్టానిక ప్రజల నుండి తెలుసుకోవచ్చు, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిచి విచారణ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## సంఘాల పర్యవేక్షణ పక్కగా నిర్వహించాలి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రైమాసిక, పర్యవేక్షణ, విచారణ సక్రమంగా నిర్వహించాలని డిసీసీబీ బ్యాంకు సూపర్వైజర్లు, సహాయ మేనేజర్లు, మేనేజర్లకు జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల పరిపాలన అంశాలపై ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందజేశారు. సంఘాల పనితీరు మెరుగుపడడానికి పరిరక్షణ నివేదికలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహేందర్ (18) శుక్రవారం మరణించాడు. కొడవలూరు మండలం రేగడిచలికకు చెందిన మహేందర్ స్థానిక స్టోన్ హాస్పిటల్‌లోని ఓ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువు తున్నాడు. నెల్లూరు నుండి ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కొద్ది దూరం వెళ్ళగానే మరి కొందరు ప్రయాణికులు బస్సులో ఎక్కేందుకు బస్సును ఆపారు. వారిని ఎక్కించు కునే క్రమంలో మహేందర్ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించని డ్రైవర్ బస్సులు ముందుకు కదిలించగా రోడ్డుపై పడిన మృతునికి తీవ్ర గాయాలలైనాయి. వెంటనే చికిత్స నిమిత్తం నారాయణ ఆసుపత్రి ప్రవించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మహేందర్ మరణించాడు. మృతుని తండ్రి మస్తానయ్య ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరవైఫల్యం

**ప్రజలను మభ్యపెట్టి అధికారం**

**మాటతప్పిన చంద్రబాబు పాలనం**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరవైఫల్యం చెందిందని, ప్రజలను అనేక వాగ్ధానాలతో మభ్యపెట్టి అధికారం పొందిన చంద్రబాబునాయుడు మాట తప్పడని జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆత్మకూరులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఆదిశేషయ్య ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం, సూపర్‌సిక్స్ ఊసే లేకపోవడంతోపాటు రెండురోజుల క్రితం తానిచ్చిన హామీల పథకాలన్నింటిని అమలుచేయాలంటే భయమేస్తోందంటూ మాట్లాడడంతో తాము ప్రజలపక్షాన మాట్లాడాల్సి వచ్చిందన్నారు. హామీలిచ్చినపుడు అమలుకు సాధ్యాసాధ్యాలు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. అనేక వాగ్ధానాలు చేసిన చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలను ఎన్నికల సమయంలో మభ్యపెట్టారన్నారు. రైతులకు, మహిళలకు నగదు ఇస్తామన్న హామీ కానీ, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం హామీకానీ అమలుకాలేదన్నారు. అధికారంలోకి వచ్చి 9నెలలైనా హామీలను పట్టించుకోవడం లేదని, జాబ్‌క్యాలెండర్ లేదని, మెగా డిఎస్‌సి అంటూ కాలం గడుపుతున్నారని, నిరుద్యోభీతి హామీని మరిచారని ఆయన విమర్శించారు. గతంలో తమ నేత జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఇచ్చిన నవరత్నాహామీలను 100శాతం అమలుచేశారని, అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేశారని, గ్రామస్వరాజ్యంలో భాగంగా సచివాలయాల వ్యవస్థ, వాలెంటరీ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజలముంగిటకు చేర్చారని, అందరికీ మేలు చేకూర్చారని, అయినా ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు అనేకానేక హామీలివ్వడంతో ఇంకా ప్రయోజనాలు కలుగుతాయన్న ఆశతో ప్రజలు అధికారమిచ్చారని, తీరా నేడు వారంతా మనస్థాపం చెందుతున్నారని, తాము పొరపాటుచేశామన్న అభిప్రాయంతో ఉన్నారని డాక్టర్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయకుంటే తమ పార్టీతరపున ప్రజలపక్షాన తమ నేత జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని డాక్టర్ చిల్లూరు హెచ్చరించారు.

### హామీలను తుంగలో తొక్కిన కూటమి నేతలు

ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కూటమి నేతలైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణలు తుంగలో త్రొక్కారని ఆత్మకూరు పట్టణ వైసీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం 9నెలల పాలన శుష్కవాగ్ధానాలు, శూన్యహస్తాల చందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో సాధ్యాసాధ్యాలు ఆలోచించకుండా అనేక హామీలిచ్చిన చంద్రబాబునాయుడు సాక్షాత్తు దేవాలయంలాంటి సచివాలయంలో తమ హామీలు అమలు చేయాలంటే భయమేస్తుందంటూ వాటిని దాటవేసే కుయుక్తిలో ఉన్నారని ఆయన విమర్శించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు తదితరులందరికీ హామీలిచ్చిన చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లో 9నెలలైనా వాటిని అమలుచేయాలన్న ఆలోచన చేయకపోగా అమలు సాధ్యంకాదన్న వ్యాఖ్యలు చేయడం ప్రజలను వంచించడమేనన్నారు. హార్బర్లను ప్రవేటుకు దారాదత్తంచేసే యోచనలో కూటమి సర్కారు ఉందని, మెడికల్‌కాలేజిలను నిర్వీర్యం చేస్తున్నారని ఆయన విమర్శిస్తూ నాడు జగన్మోహన్‌రెడ్డి అన్నివర్గాలను ఆర్ధికంగా ఆదుకునే పథకాలు అమలు చేశారని, రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్‌హెల్త్‌క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ తదితర అనేక కార్యక్రమాలు అమలుచేశారని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. హామీలను తుంగలో తొక్కుతున్న కూటమి నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకుడు కొండా వెంకటేశ్వర్లు ప్రసంగించగా వైసీపీ నాయకులు కొప్పోలు వెంకటేశ్వర్లు, తోడేట మణి, పాలేటి వెంగళరెడ్డి, అంద్రా సుబ్బారెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# తెలుగువారు గర్వించదగ్గ నటుడు బాలకృష్ణ

- బాలకృష్ణకి పద్మభూషణ్ రావటం గర్వకారణం
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని, తెలుగువారు గర్వించదగ్గ నటుడుగా పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి నటరత్న పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. నటరత్న నందమూరి బాలకృష్ణకి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదు ప్రకటించిన సందర్భంగా.. కందుకూరు పట్టణంలోని వెంకట నారాయణ బజార్ అన్నా క్యాంటీన్ వద్ద తెలుగు దేశం పార్టీ నాయకులు, నందమూరి అభిమానులు ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు హాజరై కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నందమూరి బాలకృష్ణ తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన గొప్ప నటుడు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ఇవ్వడం ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణం. బాలకృష్ణ కేవలం నటుడిగానే కాకుండా, తన తండ్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు గెలుపొందిన హిందూపురం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే ఎన్నికైన బాలకృష్ణ రాజకీయాల్లో కూడా తన తండ్రికి తగ్గ తనయుడిగా వెలుగుందుతున్నారని కొనియాడారు. సేవే పరమావధిగా క్యాన్సర్ వచ్చే రోగులకు అత్యంత ఆధునిక వైద్యం అందించడానికి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎన్నో సేవలు అందించడం జరుగుతోందని అన్నారు. వైవిధ్యమైన నటన ద్వారా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారానికి అన్ని విధాలుగా అర్హుడని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. నటరత్న నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ బిరుదు వచ్చిన సందర్భంగా రెండు రోజులపాటు అన్నా క్యాంటీన్లో భోజన సదుపాయాలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ కమిటీ కన్వీనర్ పిడికిటి వెంకటేశ్వర్లు, ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని నందమూరి అభిమానులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, షేక్ సలాం, చేకూరి వీరాస్వామి, కాకుమాని మాల్యాద్రి, మధిర మధు, షేక్ నజీర్, పలువురు పార్టీ నాయకులు, నందమూరి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### తబ్లిగ్ జమాత్ ఇస్తిమాకు వీపీఆర్ ఫౌండేషన్

# రూ.25 లక్షల ఆర్థిక సహాయం

**- ఇస్తిమా ఏర్పాట్ల పై ముస్లిం మతపెద్దలతో సమీక్ష నిర్వహించిన వేమిరెడ్డి దంపతులు**




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇస్తిమా పేరిట జరిగే ఇస్లామిక్ శాంతి సభలు కోవూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించడం చాలా ఆనందంగా వుందన్నారు వేమిరెడ్డి దంపతులు. రాష్ట వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి కొడవలూరు మండలం చంద్రశేఖరపురం వద్ద తబ్లిగ్ జమాత్ నిర్వహించే రాష్ట స్థాయి ఇస్తిమా గ్రౌండ్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి సందర్శించారు. ఫిబ్రవరి 22, 23 తేదీలలో రెండు రోజుల పాటు జరిగే ఇస్తిమా సందర్భంగా ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట నలుమూలల నుంచి దాదాపు రెండు లక్షల మంది హాజరయ్యే ఇస్తిమాకు ప్రభుత్వ పరంగా తాగునీరు, శానిటేషన్, విద్యుత్, రవాణా తదితర సౌకర్యాల కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇస్తిమా నిర్వహణకు 25 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఇస్తిమా విజయవంతం చేసేందుకు పరిసర గ్రామాల ప్రజలు సహకరించాలని వేమిరెడ్డి దంపతులు కోరారు. ఫిబ్రవరి 22, 23 తేదీలలో రెండు రోజులపాటు ఇస్తిమా నిర్వహణకు సంబంధించి ఏ అవసరమొచ్చినా తనను సంప్రదించాలని కోరారు. అనంతరం రాష్ట వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. వేమిరెడ్డి దంపతుల సహాయ సహకారాలు ముస్లిం పెద్దల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయురారోగ్యాలతో వుండాలని ముస్లిం మతపెద్దలు వేమిరెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి జాకీర్ షరీఫ్, మైనారిటీ నాయకులు నన్నే సాహెబ్‌లతో పాటు పలువురు కొడవలూరు మండల టీడీపీ నాయకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

## కుంభమేళాకు ప్రత్యేక బస్సులు




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నుండి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా టూరిజం అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు నెల్లూరు నుండి బయలుదేరి విజయవాడ, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, కటక్, చండీపూర్, గయ, బుద్ధగయ, కాశీల మీదుగా కుంభమేళా జరిగే ప్రయోగ్ రాజ్‌కు చేరుకుంటాయన్నారు. తిరుగు ప్రయాణంలో ప్రయోగరాజ్ నుంచి శ్రీకూర్మం, అరసవెల్లి, విశాఖపట్నం, విజయవాడ మీదుగా నెల్లూరుకు వస్తాయన్నారు. కుంభమేళాకు వెళ్లే ఈ ప్రత్యేక బస్సులు ఫిబ్రవరి 12వతేదీ ఉదయం 6గంటలకు నెల్లూరులోని శ్రీరాజరాజేశ్వరి ఆలయం వద్ద నుండి బయలుదేరి ఫిబ్రవరి 18వ తేదీ తిరిగి నెల్లూరు చేరుకుంటాయన్నారు. ఇందులో పెద్దలకు రూ.25వేల రూపాయలు, పిల్లలకు రూ22,500 రూపాయలు ఛార్జీగా వారు పేర్కొన్నారు. దర్శనం, అల్పాహారం, భోజనం ఖర్చులు ఎవరికి వారేయూ భరించాలన్నారు. ఇతర వివరాలకు డివిజనల్ మేనేజర్ 9848007024ను సంప్రదించాలన్నారు. www.aptdc.in లేదా tourism.ap.gov.inలో బస్ రిజర్వేషన్ చేసుకోవచ్చు నని ఆయన తెలిపారు.

### ఉద్యోగ విరమణ.. మున్సిపల్ ఉద్యోగికి సన్మానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీ నందు 35 సంవత్సరాలు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన టౌన్ ప్లానింగ్ ఉద్యోగి జంగం నాగరాజును శుక్రవారం ఘనంగా సన్మానించారు. సహచర కార్మికులు, మున్సిపల్, సివిల్ సప్లై ఉద్యోగులు, ఏఐటీయూసీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. నాగరాజును ఘనంగా సన్మానించిన అనంతరం వక్తలు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎంతో మెరుగైన సేవలు అందించి నేడు ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని, అదే తృప్తితో నేడు నాగరాజు పదవీ విరమణ పొందడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా నాయకులు మాధవ, ఇతర నాయకులు నరసింహులు, హజరత్తయ్య, మునీర్ భాష, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత జంగం నాగరాజు మాట్లాడుతూ.. తాను ఉద్యోగ నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని తన వల్ల ఏమైనా తప్పులు జరిగి ఉంటే మన్నించాలని తాను విధి నిర్వహణలో ఎంతో మెరుగైన విధులు నిర్వహించానని అన్నారు.

## ఆర్యవైశ్యుల ఆత్మబంధువుగా సీఎం చంద్రబాబు

**▶▶ ఎమ్మెల్యే కావ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తట్టపర్తి వాసు**



**కావలి, మేజర్‌న్యూస్ :** ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జరిగిన రోజును పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ప్రకటించి అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిజమైన ఆత్మబంధువుగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ తట్టపర్తి వాసు అభివర్ణించారు. శుక్రవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎందుకు సంబంధించిన అధికారిక ఉత్తరాలను చంద్రబాబు నాయుడు ఇచ్చి తమ చిత్తశుద్ధిని ఆర్యవైశ్య సామాజిక వర్గంపై తమకున్న ప్రేమ అభిమానాన్ని చాటారని హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యులతో పాటు భక్త పోటీ వాసవి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవ ని ఆధ్యాత్మిక ఆనందస్వామి మధ్య జరుపుకుంటున్నారని తను సంతోషం వ్యక్తం చేశారు. కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తన సామాజిక వర్గం పట్ల ప్రత్యేక అభిమానాన్ని చూపుతున్నారని తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటూ తమ ఆత్మ గౌరవాన్ని మరింత ఇనుమడింప చేస్తున్నారని కొనియాడారు. ఇచ్చిన హామీల మేరకు మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ఎమ్మెల్యే శ్రీరామ తాతయ్య, కర్నూల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తట్టువర్తి వాసు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రతి పౌరుడు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఉప తహసీల్దారు షాజియా పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు కల్పించే హక్కులను వివరించారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను చక్కగా చదివించాలన్నారు. అలాగే వాలు ప్రభుత్వ శాఖల అధికారులు, వారు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐ సురేంద్ర, ఏఈలు శ్రీనివాసరాజు, జగన్నాథం, ఏఎస్ డబ్ల్యూవో ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగూర్ బి పడ్స్ డైరెక్టర్ రమణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పశువులు, పచ్చి రొట్టె ఎరువుల వినియోగాన్ని పెంచాలి

## - ఏడీఏ లక్ష్మి మాధవి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** శుక్రవారం ఇందుకూరుపేట మండలంలోని జగదేవిపేట గ్రామంలో ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని సబ్ డివిజన్ స్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ లక్ష్మి మాధవి మాట్లాడుతూ.. రైతులు పంటపై అధికంగా రసాయనిక ఎరువులు వాడటం తగ్గించి, పచ్చి రొట్టె ఎరువులు, పశువుల ఎరువులు వినియోగాన్ని పెంచాలన్నారు. అదేవిధంగా సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక ధరలకు వరి ధాన్యాన్ని మరియు ఇతర పంటలను విక్రయించుకోవచ్చు అని తెలియజేశారు. డిఆర్‌సి ఏవో శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ.. పొలంబడి పొలంలో ఎలుకల నివారణకు బ్రోమోడైల్ మందును, రైతులు గట్లపైన ఎలా ఉంచుకోవాలో ఎలా తయారు చేసుకోవాలో రైతులకు తెలియజేశారు. రైతులు ఈ మందును సామూహికంగా పెట్టుకోవాలని సూచించారు. ఏడిఏ ఏ.రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ఇందుకూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాలలో మూడు గ్యాప్ పొలంబడులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రతి పొలంబడిలో 30 మంది రైతులు, వారికి 14 వారాలు పాటు తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. మూడు మండలాల్లో 15 మంది ఇండి గ్యాప్ పొలంబడి రైతులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ 15 మందికి ఈరోజు శిక్షణ ఇవ్వటం జరిగిందని పేర్కొన్నారు. ఈ 15 మంది రైతులకు జిల్లా స్థాయిలోని ఎఫ్‌పిఓ ద్వారా, రాష్ట్రస్థాయిలో ఏపీ ఎస్ ఓపిసిఎ ద్వారా ఇండి గ్యాప్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఒక క్వింటాకు 2320 రూపాయలుగా ఉందన్నారు. ఇండి గ్యాప్ పొలంబడిలో చేరి, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అతి తక్కువ ఎరువులు పురుగులు, మందులతో పండించినపంటకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అధిక ధరకు సుమారుగా ఒక క్వింటాకు రూ.3వేలు అంతకుమించి వరి ధాన్యం విక్రయించ బడుతుందని వ్యవసాయ సహాయకులు ఏ.రాజ్ కుమార్ తెలియజేశారు. రైతులతో కలిసి పొలంబడి రైతులు చేత, ఎలుకలు నివారణకు ఎలుకల ముందు కలిపిన పొట్లాలను, పొలం గట్లపైన ఉంచడం జరిగింది. ఎంఏఓ డి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. గ్యాప్ పొలంబడి అనగా రైతుల చేత నాణ్యమైన యాజమాన్య పద్ధతులు పాటింప చేసి, శాస్త్రవేత్తలు సూచనలు మేరకు పురుగుల మందులు వాడి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడిని పొందడం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి, బి.వెంకటరవి కుమార్ నాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొలంబడిలో చేరిన రైతులకు శిక్షణ ఇవ్వడానికి, నెల్లూరు డిఆర్సి నుంచి ఏడిఏ లక్ష్మీ మాధవి, ఏవో శ్రీనివాస చక్రవర్తి ఇందుకూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్ కుమార్, మూడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు డి.రఘునాథ్‌రెడ్డి, శిరీష, జోష్నారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరుగు సీపీఎం పార్టీ 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ జొన్నలగడ్డ వెంకమరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని దామరమడుగు నుండి ఆ పార్టీ ఆటో, బైక్ ప్రచారం మొదలుపెట్టారు. ప్రచార బేరిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేశాయని ఆ వాగ్దానాలు నెరవేర్చాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. ఎన్నికల వాగ్దానాలు అమలు చేసే విధంగా ఈ మహాసభల్లో పార్టీ నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. సోమవారం మూడో తారీఖున 3 గంటలకు నెల్లూరు ఆత్మ బస్టాండ్ నుంచి వి ఆర్ కళాశాల వరకు భారీ ప్రదర్శన జరుగుతుందని, అదేవిధంగా వీఆర్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభకు కేంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనకు, బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, సీపీఎం పార్టీ నాయకులు గరికిపాటి సురేష్, పుత్తేటి మల్లికార్జున, రేకులకుంట అంకయ్య, విస్సా మునిస్వామి, కృష్ణ ప్రసాద్, శ్రీనివాసులు, షేక్ జానీ బాషా, దత్త శ్రీ కోటయ్య, కొమి శ్రీనివాసులు, కన్నయ్య రత్తయ్య, జానకి రామయ్య, ప్రభాకర్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# అందరూ సమాన హక్కులు పొందాలి : తహసిల్దార్



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మర్రిపాడు మండలంలోని ఖాదర్ పూర్ ఎస్సీ కాలనీలో శుక్రవారం సర్పంచ్ అన్నవరపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తాసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్, ఎంఈఓ ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌర హక్కుల ముఖ్య ఉద్దేశం ఎక్కడైనా దేవాలయాలు బహిష్కరణ కుల విక్షత లేకుండా అందరూ సమానంగా సమాన హక్కులు పొందాలని, ఈ పౌర హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశం దీన్ని దృష్టిలో పెట్టుకొని మనమందరం కూడా ప్రతి పౌరుడు ఆ చట్టాన్ని గౌరవించాలని అందరం కూడా కలిసిమెలిసి జీవించాలని ప్రధాన అంశం అదేవిధంగా గ్రామస్తులు కొన్ని సమస్యలు కాలనీలు, పొలాలు, ఈది లైట్లు, గ్రావెల్ రోడ్లు, తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కచ్చితంగా మీ సమస్యల్ని నెరవేరుస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లంపాడు విఆర్ఓ వెంకటేశు, ఖాదర్ పూర్ పంచాయతీ కార్యదర్శి గంట కిషోర్, అంగన్వాడి టీచర్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. పంచాయితీ టిడిపి నాయకుడు అన్నవరపు నారాయణరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎగ్గొను నరసింహారెడ్డి, కన్నెమరకల ప్రసాద్, ఎనిపిలా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కడియాల రమేష్‌ను పరామర్శించిన మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో కడియాల రమేష్ ఇటీవల అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు శుక్రవారం వైద్యశాలకు వెళ్లి వారిని పరామర్శించారు. అలాగే వాళ్ళ కుటుంబ సభ్యులను కూడా అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లను పిలిచి మెరుగైన వైద్యం అందించాలని కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

## అదుపుతప్పి కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లా సరిహద్దు ప్రాంతంలోని నెల్లూరు-ముంబై జాతి రహదారిపై మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులోని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో చెన్నై నుంచి పొద్దుటూరు వెళుతుండగా ప్రమాదవశాత్తు మార్జిన్ దిగిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదాన్ని గమనించిన రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు, గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని సమీపంలోని బద్వేలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీత బి.హంస వేణికి సత్కారం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మండల పరిషత్ కార్యాలయంను జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.హంస వేణికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా తాను చేసిన సేవల గాను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉద్యోగినిగా అవార్డును బహుకరించారు. మండల పరిషత్ ఆఫీసులో పనిచేస్తున్న వ్యక్తికి అవార్డు రావడం సంతోషంగా ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీదేవి, సిబ్బంది శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ విస్తరణ అధికారి అబ్దుల్ సమత్, పంచాయతీ కార్యర్శులు సీనియర్ సహాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం 10గంటలకు ఉదయగిరిలోని షాదీ మన్జిల్‌లో సీతారాంపురం ఉదయగిరి దుత్తలూరు వరికుంటపాడు మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు తరగతి గదిని ఆకర్షణీయంగా రూపొందించడం ఎలా అనే అంశం మీద, విశ్వం. మనం అనే అంశం మీద శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయి. ఈ శిక్షణా కార్యక్రమాలను వెంకటసుబ్బయ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రారంభిస్తారాని జన విజ్ఞాన వేదిక నాయకులు దస్తగిరి అహ్మద్ శుక్రవారం ప్రకటన పేర్కొన్నారు. శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయులు తరగతిగదిని ఆకర్షణీయంగా రూపొందించడం ఎలా అనే అంశాన్ని డాక్టర్ బ్రహ్మారెడ్డి జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు, విశ్వం మనం అనే అంశాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ జి.సుధాకర్‌రెడ్డి శిక్షణ ఇస్తారు. కావున ఉదయగిరి డివిజన్లోని ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అందరూ శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక ఉదయగిరి డివిజన్ నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి తదితరులు పేర్కొన్నారు.

# మధ్యవర్తిత్వంలో మీడియేటర్లదే కీలకపాత్ర

## ముగింపు సభలో జిల్లా జడ్జి యామిని



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** వివిధ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం వహించే మీడియేటర్లు అంకిత భావంతో పనిచేసి కేసుల పరిష్కారంలో ఇరు వర్గాలకు సమ న్యాయం సరైన న్యాయం అందించాలని, తద్వారా నెల్లూరు జిల్లాకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ వ్యవస్థలో మంచి పేరు తీసుకురావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మీడియేషన్ సెంటర్ డైరెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం జరిగిన మీడియేటర్ల శిక్షణ తరగతుల ముగింపు సభలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లోక్ అదాలత్ మీడియేటర్స్ ప్యానల్‌లో జిల్లావ్యాప్తంగా ఎంపికైన న్యాయవాదులు ఎంతో శ్రద్ధతో గత సోమవారం నుంచి 40గంటల శిక్షణా కార్యక్రమం ముగించుకొని మీడియేటర్లుగా అదనపు హోదా పొందటం హర్షదాయకమని ఆమె అన్నారు. కేసులు పరిష్కారంలో మీడియేషన్ యాక్ట్ ప్రకారం మీడియేషన్ వ్యవస్థకు మీడియేటర్లు మంచి పేరు తేవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నై హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వంపై శిక్షణా తరగతులు నిర్వహించిన డాక్టర్ శశి దేవి, డాక్టర్ సి.పద్మ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి, మీడియేటర్లు డి.శివకామేశ్వరి సాయిప్రసాద్, అల్లూరు తిరుపతమ్మ, పి.రాంప్రసాద్ తదితరులు మాట్లాడారు. శిక్షణ తరగతులు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన లోక్ అదాలత్ ఉద్యోగులు సూపరింటెండెంట్ లీలమ్మ, సీనియర్ అసిస్టెంట్ సుమతి, జూనియర్ అసిస్టెంట్ రజనీ రమణయ్య రాకేష్ పెంచలయ్య, గోపాల్ తదితరులను సమావేశంలో అభినందించారు. కాగా శిక్షణ పొందిన మీడియేటర్‌లను అభినందించిన జిల్లా జడ్జి యామిని వారితో గ్రూప్ ఫోటో దిగారు. కాగా సోమవారం నుంచి ప్రారంభమైన లోక్ అదాలత్ మీడియేటర్ల 40 గంటలశిక్షణ తరగతులు విజయవంతం అయ్యాయి. కక్షిదరులకు ముఖ్యంగా ఫ్యామిలీ కోర్టు వివాదాలకు సంబంధించిన భార్యాభర్తలకు ఈ మధ్య వర్తిత్వం ఎంతో ఉపకరిస్తుందని న్యాయమూర్తి అదాలత్ కార్యదర్శి వాణి ఆశాభావం వ్యక్తం చేశారు.

# చెత్త సేకరణ వృత్తిదారులను గుర్తించండి : అదనపు కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టలు, ఇతర నిరుపయోగ వస్తువులను సేకరించి, మార్కెట్లో విక్రయించి జీవనం సాగించే వృత్తిదారులను గుర్తించి వారికి ఆర్థిక భద్రతను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ నందన్ తెలియజేశారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ ను కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్లో శుక్రవారం నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించి అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం ద్వారా గతంలో 93 మంది భూగర్భ డ్రైన్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులకు ఐదు లక్షల విలువైన ఉచిత వైద్య సేవలు పొందే ఆయుష్మాన్ కార్డులను అందించామని తెలిపారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య నోడల్ అధికారిగా, 30 మంది వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల బృందం నూతనంగా సర్వేలు నిర్వహించనున్నారని తెలిపారు. సచివాలయాల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి విక్రయించుకునే వారి వివరాలను యాప్ ద్వారా నమోదు చేయించి, ఆ వృత్తిలో కొనసాగుతున్న వారందరితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నామని వివరించారు. ఎక్కువ సంఖ్యలో వ్యర్థాలను సేకరించే వారికి ఉచిత వాహనాలను అందించి వారి కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్య సేవలు అందించేలా ఆయుష్మాన్ కార్డులను అందజేస్తామని తెలిపారు. నిరుపేద ప్రజల జీవన భద్రతను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని అదనపు కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ సాయి కృష్ణ, శానిటేషన్ సూపర్వైజర్ నరసింహారావు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహిళలకు మోదీ సర్కార్ బంపర్ ఆఫర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గర్భిణీ స్త్రీల కోసం ప్రధానమంత్రి మాతృ వందనా యోజన, మహిళలకు గొప్పవరం అని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ తెలిపారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన్ మంత్రి మాతృ వందనా యోజన (పీఎంఎంవీవై) పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందని, కానీ ఈ పథకం పట్ల చాలామంది మహిళలకు అవగాహన లేదని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, తల్లి, శిశువుల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అర్హులైన ప్రతి గర్భిణీ మహిళ ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలి" అని సూచించారు. మొదటి బిడ్డకు ఈ పథకం వర్తిస్తుందనీ ఒకవేళ రెండవ బిడ్డ ఆడపిల్ల అయితే మాత్రమే లబ్ధి పొందవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర మాతృ సంక్షేమ పథకాలు పొందుతున్నవారు అర్హులు కాదు, దరఖాస్తు విధానం గర్భిణీ స్త్రీలు అంగన్‌వాడీ కేంద్రం లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రవీణ్ సూచించారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్స్, వద్ద అప్లికేషన్ ఫారం తీసుకుని, అవసరమైన ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా, గర్భధారణ నమోదు ధృవీకరణ వంటి డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. అలాగే, పీఎంఎంవీవై అధికారిక వెబ్‌సైట్ https://pmmvy.wcd.gov.in లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు కూడా చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణ మెరుగుపడుతుందని, నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. అర్హులైన గర్భిణీ స్త్రీలు తప్పకుండా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్లానింగ్ కార్యదర్శులు ఆక్రమణలను గుర్తించండి

● అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు తమ సచివాలయాల పరిధిలోని ఆక్రమణలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్లానింగ్ కార్యదర్శులు విధులను ప్రణాళికాబద్ధంగా నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణలకు గురైన నగరపాలక సంస్థకు చెందిన స్థలాలను గుర్తించి ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం పై లేఔట్ యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తమ పరిధిలోని షాపులకు సంబంధించి అడ్వర్టైజ్మెంట్ టాక్స్ వసూలు చేయాలని, అలాగే వార్డ్‌కు పరిధికి సంబంధించి ప్లాన్లు వెంటనే తయారు చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ పద్మజ, ఏసీపీ వేణు, ప్రకాష్, సర్వేయర్లు, సూపరెంటెండ్ పద్మ, టీపీబీఓలు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయితీ వడ్డీ పాలెం గ్రామంలో ఉన్న జీసస్ క్రాస్ మందిరం ఆవరణంలో నిర్మాణంలో ఉన్న రూమును గ్రామస్తులు శుక్రవారం పగలగొట్టడంతో చర్చి సంఘ కాపరి జీవన్ కుమార్, చర్చి వ్యవస్థాపకురాలు శారద పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బిట్రగుంట ఎస్ఐ బోజ్య నాయక్ సంఘటన స్థలాన్ని చేరుకొని గ్రామస్తులుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. చర్చికి ముందు భాగాన గ్రామానికి అవసరమైన నీటి బోర్ పంపును వేసి పైపులైను చర్చి పక్కనుండి తీసుకొని వెళ్లారని, ఆ పైప్ లైన్ పై రూమును శారద అనే మహిళ నిర్మించారని, మంచినీటి బోర్‌కి దగ్గర్లోనే చిన్న రూము నిర్మించుకొని ఉంటున్నగా ఆ రూము బాత్రూంగా అనుమానంతో గ్రామస్తులు నిర్మాణంలో ఉన్న రూమును పగలగొట్టారని, అలా చట్టాన్ని చేతిలోకి తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమని, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే చట్టపరమైన కఠిన చర్యలకు బాధ్యులవుతారని, ఈ విషయమై గ్రామ పెద్ద లతో మాట్లాడుతున్నామని ఆయన తెలిపారు. చర్చి వ్యవస్థాపకరాలు శారద మాట్లాడుతూ.. గ్రామస్తులు గురువారం రాత్రి తమతో మాట్లాడాలని గ్రామ పెద్దలు పిలిచి ఇస్తానుసారంగా తమతో మాట్లాడారని, ఉదయం పోలీస్ స్టేషన్ వెళ్లి కేసు పెట్టి వచ్చేసరికి నిర్మాణంలో ఉన్న రూమును గ్రామస్తులు పగలగొట్టారని, ప్రభుత్వం తమకు న్యాయం చేసి, రక్షణ కల్పించాలని తెలిపారు.

# ఆంధ్ర కేసరి మున్సిపల్ పాఠశాలను హైస్కూల్‌గానే పరిగణించాలి

## విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి జనతా పేటలో ఉన్న ఆంధ్రకేసరి ప్రాథమిక ఉన్నత పాఠశాల డి గ్రేడ్ 6, 7, 8 తరగతులను తీసివేసే ఆలోచన మానుకొని హైస్కూల్ గానే కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కావలి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆంధ్ర కేసరి స్కూలు హై స్కూల్ గానే పరిగణం లోనికి తీసుకోవాలని నినాదాలు ఇచ్చారు. స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటకృష్ణ మాట్లాడుతూ.. ఆంధ్ర కేసరి స్కూల్‌ను హై స్కూల్ గానే అప్డేట్ చేసి స్కూల్ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ.. 71 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆంధ్ర కేసరి స్కూల్‌ను డి గ్రేట్ చేయడం సరికాదని తక్షణమే హైస్కూల్‌గా అప్డేట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైమరీ, హై స్కూల్ మాత్రమే ఉండాలని ప్రభుత్వం తెచ్చిన జీవోను ఆంధ్రకేసరి స్కూలుకు మినహాయించాలని తెలిపారు. మొత్తం స్కూల్ విద్యార్థులు 500 పైగా ఉన్నారని 6, 7, 8 తరగతుల విద్యార్థులు 150 మందికి పైగా ఉన్నారని హైస్కూల్ గానే అప్డేట్ చేస్తే మరింత మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 5వ తరగతి 60 మంది విద్యార్థులు ఉంటే హైస్కూల్‌గా అప్డేట్ చేయవచ్చని జీవో ఉన్న ఇక్కడ మాత్రం 180 మంది విద్యార్థులు ఉన్నా కూడా హైస్కూల్‌గా ఎందుకు అప్డేట్ చేయాలని ప్రశ్నించారు. అలాగే స్కూలుకి అతి సమీపంలో మున్సిపాలిటీ స్థలం రెండు ఎకరాలు పైగా ఉందని అందులో ఆంధ్రకేస్ హై స్కూల్ ని నిర్మాణం చేయవచ్చు అని అధికారులకు సూచించారు. పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకోడానికి అనుకూలంగా ఉండే ఈ స్కూల్‌ని డీగ్రేట్ చేయడం అన్యాయమని తెలిపారు. ఏడు ఎనిమిది తరగతులను తొలగించడం వలన దగ్గర్లో ప్రభుత్వ పాఠశాల లేకపోవడం వలన అధిక భారంతో ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయించాల్సి వస్తుందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా డ్రాపోర్ట్స్ కూడా పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది భవిష్యత్తులో ఆంధ్రకే శ్రీ మున్సిపల్ స్కూలు మను కూడా సమస్యగా మారుతుందని తెలిపారు. తక్షణమే డి గ్రేడ్ ఆలోచనను విరమించు కొని హై స్కూల్ గానే ఆపరేట్ చేయాలని తల్లిదండ్రులు కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏఓకి వినతిపత్రాన్ని అందించారు.

# వాసిలిలో పౌర హక్కుల దినోత్సవం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం వాసిలి ఎస్టీ కాలనీ నందు నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ చెలికా రమాహరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అందరికీ కల్పించిన హక్కుల ద్వారా స్వేచ్ఛ సమానత్వం వివక్ష లేని సమాజంగా అందరూ అభివృద్ధి చెందాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే ఎస్సీ ఎస్టీ కాలనీలలో అందరూ మండల స్థాయి అధికారులతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకోవడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడినదని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఎస్ఐ, రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అందరూ కూడా స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి హాజరు కావడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా ఎస్టీ కాలనీ ప్రాంతంలో ఉన్న చిన్న పిల్లలను పాఠశాలలకు పంపించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. విద్యాభివృద్ధి ద్వారానే కుటుంబాలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందుతారని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. కలెక్టర్ ఎస్టీ కుటుంబాలు అందరికీ రేషన్ ఆధార్ కార్డులు ఉండే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొన వలెనని కోరారు. ఎవరికైనా రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేనట్లయితే సచివాలయ సిబ్బంది ద్వారా త్వరితగతిన ఇప్పించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ నారాయణమ్మ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లుగా తెలియజేసి పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలని కోరారు. ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టల్ వసతిని ఉపయోగించుకుని పిల్లలను పాఠశాలలో చేర్పించవలసిందిగా కోరారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. స్థానిక సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ కొండయ్య, ఎంఆర్‌సి బ్రహ్మయ్య, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు బహిర్గతం చేస్తే చర్యలు : డీఎం అండ్ హెచ్ఓ




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** లింగ నిర్ధారణ పరీక్షలను బహిరంగపరచడమంటే భ్రూణ హత్యలను ప్రోత్సహించడమేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.సుజాత అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు కొరకు జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. పీసీపీఎన్ డీటీ చట్టం (ప్రీ–కాన్సెప్షన్, ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) ప్రధాన లక్ష్యం లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టడం భ్రూణహత్యలను తగ్గించడమేనని అన్నారు. పురుషులు, మహిళల నిష్పత్తిని సమతుల్యం చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో లింగ నిష్పత్తి ప్రతి 1000 బాలురకు 1011 బాలికలు ఉన్నారని, రాష్ట్రంలో జిల్లా నాల్గవ స్థానంలో ఉన్నదన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్టానికి లోబడి తమ స్కానింగ్ కేంద్రాలు నిర్వహించుకోవాలని, ఎట్టిపరిస్థితుల్లోను లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని, చట్ట నియమనిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా త్వరలో జిల్లాలో స్కానింగ్ సెంటర్లపై ఆకస్మికంగా 'డెకోయ్ ఆపరేషన్'లు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డా.సర్దార్ సుల్తానా, డా.సిహెచ్ కిరణ్, అనాటమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వర్ణ రెడ్డి, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి.ఎల్ దయాకర్, ఎన్‌జిఓలు జి.కవితరెడ్డి, ఐ.శ్రీనివాసరావు, కె.కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అనుమసముద్రంలో పౌర హక్కుల దినోత్సవం




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం అనుమసముద్రం గ్రామం ఎస్టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అందరికీ కల్పించిన హక్కుల ద్వారా స్వేచ్ఛ సమానత్వం వివక్ష లేని సమాజంగా అందరూ అభివృద్ధి చెందాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అందులో భాగంగా ఎస్సీ ఎస్టీ కాలనీలలో ఇలాంటి కార్యక్రమాలు అధికారులతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకోవడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఎవరికైనా రేషన్ కార్డులు ఆధార్ కార్డులు లేనట్లయితే సచివాలయ సిబ్బంది ద్వారా త్వరితన ఇప్పించడానికి ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్ఐ ఏ సైదులు మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కాలనీలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి చదివించాలని సూచించారు. విద్యతోనే అన్ని విధాల అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్ వాడి కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. చిన్న పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మస్తాన్ వలీ, వీఆర్వో రాఘవులు, టిడిపి నాయకులు పులిమి సుధాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఫీజుపోరును జయప్రదం చేయాలి

## పోస్టర్లు విడుదల చేసిన వైసీపీ నేతలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఈనెల 5వ తేదీన వైఎస్ఆర్‌కాంగ్రెస్ తలపెట్టిన ఫీజుపోరు కార్యక్రమంకు ప్రజలు అధికంగా హాజరై విజయవంతం చేయాలని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, ఆత్మకూరు పట్టణ వైసీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డిలు కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆత్మకూరులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో డాక్టర్ ఆదిశేషయ్య, ప్రతాప్‌రెడ్డి తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలును అమలు చేయలేదని, విద్యార్థులకు సంబంధించిన ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌కు నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. విద్యార్థులపక్షాన అండగా నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసనగళం విప్పేందుకు ఈకార్యక్రమాన్ని తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈకార్యక్రమాన్ని రూపొందించారని వారు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. నాలుగు త్రైమాసికాలుగా బకాయిపెట్టిన ఫీజ్‌రీయంబర్స్‌మెంట్, వసతిదీవెన క్రింద ఇవ్వాల్సిన 3.900కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని, నిధులు విడుదల కానందున విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని, కాలేజిల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని డాక్టర్ ఆదిశేషయ్య, ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడి విద్యార్థుల ఫీజ్‌రీయబర్స్‌మెంట్, వసతిదీవెన నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, కొప్పోలు వెంకటేశ్వర్లు, తోడేట మణి, పాలేటి వెంగళరెడ్డి, అంద్రా సుబ్బారెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు.



# పొగాకు రైతుల భగీరథయత్నం !

**జిల్లాలోని పొగాకు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. సాగు చేస్తున్న పంట కు సాగునీరు కరువు అవ్వడంతో ఆ రైతులు భగీరథ ప్రయత్నాలు చేయక తప్పడం లేదు. ఎన్నో కిలోమీటర్ల వ్యవసాయ మోటార్ల నుండి పైపుల ద్వారా సాగునీరును పంటకు అందిస్తూ కాపాడుకుంటున్నారు. దీంతో పెట్టుబడులు రెట్టింపు అవుతున్నాయి. ఎన్నో తుఫాన్లు వచ్చినా కనీసం చెరువుల్లో కూడా నీరు రాకపోవడంతో పంటకు సాగునీరు అందించడం గగనమైంది. ఈ తరుణంలో ప్రస్తుత ఏడాది పొగాకు రైతు ఆదిలోనే ఆందోళన చెందక తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే..**

- పంటకు గగనమైన సాగునీరు
- కి.మీల దూరం నుంచి నీటిని అందిస్తున్న వైనం
- రెట్టింపు అవుతున్న పెట్టుబడులు
- ఆదిలోనే రైతుల్లో ఆందోళన

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలో 11 మండలాలకు సంబంధించిన రైతులు ఎన్నో సంవత్సరాలుగా పొగాకు పంటను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో మెట్ట ప్రాంతమైన పలు మండలాల్లో ఎటువంటి జల వనరులు లేకపోవడంతో వర్షాధారం మీదే ఆధారపడి పంటను సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో ప్రతి ఏడాది లాగానే రైతులు పంటను సాగుచేశారు. అయితే పంటకు సాగునీరు అందించడంలో భగీరథ ప్రయత్నం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పలు తుఫాన్లు వచ్చినప్పటికీ కనీసం చెరువులు కూడా నిండకపోవడంతో వ్యవసాయ బోర్ల నుంచి కిలోమీటర్ల పొడవునా పైపులు ద్వారా పంటకు సాగునీరు అందిస్తూ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ బోర్డు పరిధిలో 2055 మంది రైతులు 1723 బేరన్లలో పొగాకును సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికీ 58 హెక్టార్లలో రైతులు పంటను సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటకు సాగునీరు అందించేందుకు నానా అవస్థలు పడుతున్నప్పటికీ పెట్టుబడులు కూడా రెట్టింపు అవుతున్నాయి. దీనికి తోడు అష్ట కష్టాలు పడి పెట్టుబడులు రెట్టింపు అయినప్పటికీ సాగునీరు అందిస్తూ పంటను కాపాడుతున్న తరుణంలో వాతావరణం కూడా అనుకూలించక ముసురు ఏర్పడి పంట నాశనానికి గురి చేస్తున్నడంతో రైతులు ఆందోళన చెందక తప్పడం లేదు. దీంతో పంటకు చీడపీడల బెడద కూడా ఎక్కువైంది. ఫలితంగా అధికంగా పురుగు మందులు కూడా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోసారి ఈ పురుగు మందులు వాడకానికి కూడా పెట్టుబడులు ఎక్కువయ్యాయని చెప్పవచ్చు. మరోపక్క ప్రస్తుతం నాట్లు, చావు నాట్లు వేయడానికి కూడా నీరు లేకపోవడంతో డ్రమ్ములకు నీరు నింపి నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని రైతులు వాపోతున్నారు. కాబట్టి ప్రస్తుత ఏడాది రైతులు ఆదిలోనే అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాబోయే వేలం ప్రక్రియలో పొగాకు మంచి ధర లభించుకుంటే రైతులు తీవ్రంగా నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఈ భగీరథయత్నానికి తోడుగా క్యూరింగ్ చేసేందుకు ముఠా కూలీలు, ఆకులను వలిచేందుకు సాధారణ కూలీలు, పొగాకు క్యూరింగ్ చేసేందుకు ఉపయోగపడే కర్ర ఇక ఇతర సామాగ్రి కొరకు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఒక బ్యారన్ పొగాకును పండించేందుకు ఏడు నుంచి పది లక్షల రూపాయలు ఖర్చవుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందువలన ఆరుగాలం అష్ట కష్టాలు పడి పండిస్తున్న పొగాకుకు గిట్టుబాటు ధర లభిస్తుందో లేదో అని ఇప్పటి నుంచే రైతులు ఆందోళన చెందుతున్నారు.





సూర్య
# విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

## నిరుద్యోగులకు ఒక సువర్ణ అవకాశం కల్పిస్తున్న 'అనంతార్ధ అసోసియేట్స్'

**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు లేక అనేకమంది ఇతర దేశాల వైపు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉన్నందున కావలి పట్టణం ఉన్నత విద్యావంతులు కావలి నియోజకవర్గం లో ఉన్న నిరుద్యోగులకు కొంతమంది నైనా తమ కాళ్ళ మీద తను జీవితాలను పోషించుకునేందుకు నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా 'అనంతార్ధ అసోసియేటర్స్' సంస్త ద్వారా ఒక సంస్థను స్థాపించి ట్రేడింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. కావలి పట్టణంలో ముసునూరు మర్రిచెట్టు కాలనీలో ఈ ట్రేడింగ్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు అసోసియేటర్స్ తెలిపారు. నెల్లూరు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు, గృహాలకు ఈ సువర్ణ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకొని ఈ ట్రేడింగ్‌లో ఉన్నత స్థితిలో ఉండేందుకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా ఈసంస్ట వారు తెలిపారు. ఈ సమస్యలో సుమారు వంద మందికి పైగా ప్రస్తుత బ్యాచ్ లో ఈ ట్రేడింగ్ కోర్సు నేర్చుకుంటున్నారని ఈ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఫిబ్రవరి 8-2025 ప్రారంభించబడుతుందని, ఆసక్తిగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థితిలో ఎదగాలని తమ ఎన్నో ఆలోచనలు కలలు కంటారని ఈ కలలను సహకారం చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్త వారు తెలిపారు. ఈ సమస్యలో ట్రైనింగ్‌లో చేరదలచిన వారు వై.కృపానిధి 8686513242 ఫోన్ నెంబరు సంప్రదించాలని తెలిపారు.

## ఉత్తమ పంచాయతిగా మిక్కిలింపేట

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖచే ప్రశంశాపత్రం అందుకున్న సర్పంచ్
- ఉత్తమ సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులు



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం మిక్కిలింపేట సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామ సర్పంచ్ గ్రామాభివృద్ధికి పాటు పడాలని కోరారు వేమిరెడ్డి దంపతులు అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపి జాతీయ స్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా ప్రశంసలందుకున్న కొడవలూరు మండలం మిక్కిలింపేట సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి అర్హులకు చేర్చడంలో గ్రామ సర్పంచులు చొరవ చూపాలన్నారు. గ్రామాలలో ప్రజలకు సురక్షిత తాగునీటి సదుపాయాలతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె సూచించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దోమల వ్యాప్తి ద్వారా డెంగ్యూ, చికెన్ గున్యా, విషపూరిత జ్వరాలు విజృంభించే అవకాశం మెండుగా ఉందని ఇంటితోపాటు, చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని శకునాలపల్లి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ వాసులతో మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాప్తి చేసే దోమల లార్వాలను నిర్మూలించవచ్చని ఆమె తెలిపారు. రాత్రిపూట దోమ కాటు నుండి రక్షణకు దోమతెరలు వాడాలని, ఇంటిల్లపాది వేపాకు పొగను వేసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలను ఆమె కోరారు. ఇంటింటి లార్వా సర్వేను పరిశీలించి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి ఓపిని పరిశీలించారు. ప్రతిరోజు ఎన్ని జ్వరం కేసులు నమోదవుతున్నాయి, రికార్డులు సక్రమంగా రాస్తున్నారా లేదా అని ఎంఎల్‌హెచ్‌పిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషద్ బాబు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది కే.రాజేశ్వరి, డి.చంద్రకళ, సుహాసిని, అనిత తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్ పంపిణీ ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా నిర్వహించండి : అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతినెల పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను శనివారం ఉదయం 6.00 గంటల నుంచి అన్ని డివిజన్ల సచివాలయాల పరిధిలో పంపిణీ చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ టెలికాన్ఫరెన్స్ ద్వారా వార్డ్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మొదటి రోజు పెన్షన్ 98 శాతం వరకు పంపిణీ జరిగేలా 27 మంది సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పెన్షన్లు ఖచ్చితముగా అందించేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.